చిరు వ్యాపారులపై పన్నులు విధించడం దారుణం

-- ఏఐటీయూసీ --

విశాలాంధ్ర-పెందుర్తి: బతుకు తెరువు కోసం రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై పెద్ద మొత్తంలో పన్నులు వేసి వేధించడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.కే. రెహమాన్, వేపగుంట ముత్యమాంబ తోపుడుబల్ల సంఘం అధ్యక్షుడు వై.రాంబాబు ఆక్షేపించారు. జీవీఎంసీ జోన్ 8 కార్యాలయం వద్ద సోమవారం ఉదయం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు ఆందోళన చేపట్టారు. అనంతరం జోనల్ కమిషనర్ హైమావతికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రెహమాన్, రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ఆరు నెలలకు ఓసారి 1500 చొప్పున పన్నులు విధించిన జీవీఎంసీ అధికారులు ఇప్పుడు మళ్లీ రోజుకు 25 చొప్పున వసూలు చేయడం అన్యాయమని విమర్శించారు అధికారులు తీరుతో వందలాదిమంది చిరు వ్యాపారుల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని వాపోయారు. గత కొన్నేళ్లుగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఎన్ఏడి కొత్త రోడ్డు నుంచీ పెందుర్తి, గోపాలపట్నం, అడవివరం జంక్షన్ వరకు రోడ్లకు ఇరువైపులా రోజూ టిఫిన్, పండ్లు, పువ్వులు, చిరు తిండ్లు, కాయకూరలు, పూసలు, ప్లాస్టిక్ సామగ్రి, వంటి వ్యాపారాలు చేసుకుంటూ వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, వీరందరి వద్ద ఆరు నెలలకు ఒకసారి జీవీఎంసీ అధికారులు తాత్కాలిక పన్నులు 1500 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాగే కొన్ని నెలల కాలం నుండి ఆశీలు పేరుతో రోజుకు 10, 20 రూపాయల చొప్పున నెలకు 600 రూపాయలు అదనంగా చెల్లిస్తున్నారని చెప్పారు. ఒక వైపు వ్యాపార పెట్టుబడి, బండి అద్దె, దుకాణం ముందు వారికి అద్దె చెల్లించటం వంటి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుందన్నారు. సరైన సెల్టర్లు లేక ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ తెచ్చేసరుకు, తయారు చేసే సరుకులు అమ్ముడు పోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ రోజువారి చేసే అప్పులు సకాలంలో తీర్చుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీనికి తోడు పోలీసు వారు అప్పుడప్పుడు వీరిపై పెట్టి కేసులు పెట్టి కోర్టులు చుట్టూ తిప్పుతున్నారని, 2014 సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం చిరు వ్యాపారులకు హాకర్ జోన్స్ ఏర్పాటు చేయడంతోపాటు వ్యాపారాలు నిర్వహించే వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేసి, స్ట్రీట్ వెండింగ్ కమిటిని వెంటనే ఏర్పాటు చేసి, వీరికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో రోజువారి వసూలు చేస్తున్న ఆశీలను నిలిపివేయాలని జోనల్ కమిషనర్ను కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో 341 విజ్ఞప్తులు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్" లో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు..... జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జి వి ఎమ్ సి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం...

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ నకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గ్రీవెన్స్ వచ్చిన 48 గంటల్లోగా గ్రీవెన్స్ ఓపెన్ చేయని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీల పై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి, ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 24, 25 తేదీలలో జిల్లా కలెక్టర్స్ కాన్ఫరెన్స్ ఉందని, ఇందు కోసం

గతంలో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తెలియజేసిన జిల్లాకు సంబంధించిన విషయాలపై చేపట్టిన చర్యలతో పాటు, భవిష్యత్తు కార్యాచరణ వివరాలకు సంబంధించిన శాఖాపరమైన నివేదికల నోట్స్ మరియు పిపిటి లను తేది18-3-2025 సాయంత్రం లోగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వారికి అందజేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ అదేశించారు.చివరగా సైన్ లాంగ్వేజ్ తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొంది, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకున్న ఏడుగురు బదిరుల విద్యార్థినీ విద్యార్థులకు సైన్ లాంగ్వేజ్ యాప్ తో కూడిన సెల్ ఫోన్ లను జిల్లా కలెక్టర్ అందజేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 341 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 163 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 27, జీవీఎంసీ సంబంధించి 85 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 66 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

30న సింహాద్రి నాథుని ఉడుపు రాట

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ఈనెల 30న విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం స్వామివారికి ఉదయం విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన, మంగళా శాసనం జరుగును. అనంతరం ఉగాది పచ్చడి భక్తులకు వితరణ జరుగును. సాయంత్రం గం. 4 లకు ఆలయ ప్రధాన అర్చకులు వారిచే పంచాంగ శ్రవణం, గం.4.30 ని లకు స్వామివారి వార్షిక తిరుకల్యాణం పెళ్లి ఉడుపురాట మహోత్సవం, గం. 5 లకు పండిత సత్కారాలు, దాతల విశిష్ట పురస్కారం , స్వామివారి తిరువీధి కార్యక్రమం జరిపేందుకు వైదిక పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 8న రథోత్సవం, వార్షిక తిరు కళ్యాణ మహోత్సవం, 30న చందనోత్సవం (నిజరూప దర్శనం)

సింహాద్రి నాథుని దర్శించుకున్న కోర్టు చిత్ర నటీనటులు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని కోర్టు చిత్ర నటీనటులు దర్శించుకున్నారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ తమ గోత్రనామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గీతంలో నోటి సంరక్షణ వారోత్సవాలు

విశాలాంధ్ర-మధురవాడ: గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ఆధ్వర్యంలో నోటి సంరక్షణ వారోత్సవాలు సోమవారం ప్రారంభంఅయ్యాయి. గీతం దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహరావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ నోటి ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా చక్కటి ఆహార అలవాట్లుతో పాటు దంతాలను శుభ్రం చేసుకోవడం, ధూమపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉండటం అవసరంఅన్నారు. గీతం దంత కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏటా 30 వేలమంది స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని అలాగే సామాజిక దంత వైద్య విభాగం ద్వారా వివిధ ప్రాంతాలలో ఉచిత దంత వైద్య శిభిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నోటి కేన్సర్ సమస్యలను ఎదుర్కొంటున్న వారికి ఇటీవల శస్త్ర చికిత్సలు అందించామన్నారు. అధునాతన వైద్య పరికరాలతో దంత చికిత్సలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. గీతం సామాజిక దంత వైద్య విభాగం నిపుణులు డాక్టర్ మనిష్‌కుమార్ దంత సంరక్షణ విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని, ఫాస్ట్‌ఫుడ్‌లకు, శీతల పానియాలకు అతిగా అలవాటు పడకూడదని సూచించారు. చిగుళ్ళ వ్యాధులు అందుకు గల కారణాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ త్రినాద్‌కిషోర్, డాక్టర్ నాగజప్రియ ఇతర వైద్య నిపుణులు పాల్గొని నోటి ఆరోగ్యం పై అవగాహన కలిగించడంతో పాటు దంత పరీక్షలను నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో ఈ అవగాహన శిభిరాలను నిర్వహించనున్నారు.

యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-అనందపురం: మండలంలో బాకురు పాలెం గ్రామానికి చెందిన పలికల రమేష్ (26) వైజాగ్ లో హెచ్‌పిసిఎల్ లో పనిచేస్తున్నాడు ఇతనికి ఒక కుమారుడు(1) భార్య భారతి ఉన్నారు. రమేష్ మద్యానికి బానిసై తన తండ్రి తో ఘర్షణపడి గ్రామం దగ్గర కల్లాలో సమీపంలో ఉన్న గుడి వద్దకు వెళ్లి ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీపంలో ఉన్న చిన్నాన్న చూసి కిందకి దింపేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడు భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం కి పంపించినట్లు ఈ కేసును అనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన యువకుడి కేసు చేధించిన పెందుర్తి పోలీసులు

విశాలాంధ్ర-పెందుర్తి: ఈనెల 7న తప్పిపోయిన నాయుడు తోట ప్రాంతానికి చెందిన జూజూరు శివ గణేష్ ఆచూకిని పెందుర్తి పోలీసులు గుర్తించారు. శివ గణేష్ కనిపించకుండా పోయిన ఘటనపై, అతని కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో, పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సీఐ కెవి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో, హెడ్ కాన్స్టేబుల్ స్వామి చురుకుగా స్పందించి, శివ గణేష్ ఆచూకీని కనుగొని, సోమవారం ఉదయం అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమారుడు సురక్షితంగా తిరిగి వచ్చేందుకు సహాయపడ్డ పెందుర్తి పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. పెందుర్తి పోలీసులు తమ పరిధిలోని ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తారని, ఈ తరహా ఘటనలు జరిగినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సిఐ సతీష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నగర కాలుష్య నిర్మూలనకు విశాఖ ప్రజలు సహకరించండి

నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కాలుష్య నిర్మూలనకు విశాఖ ప్రజలు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె క్యాంపు కార్యాలయం నుండి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా నగర మేయరు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం నిత్యం పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలను విడనాడి ప్రజా రవాణాలను ఉపయోగించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో కాలుష్యం నిత్యం పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ ప్రజా రవాణా వ్యవస్థ ను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమాలలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి అనేక అవగాహనా పరమైన కార్యక్రమాలు నిత్యం చేపట్టడం జరుగుతోందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల యాజ మాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను లేదా సైకిళ్లను ఉపయోగించడం వలన విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చునని అందుకు అందరూ సహకరించాలని నగర మేయర్ విజ్ఞప్తి చేశారు.

జీవీఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ లు

విశాలాంధ్ర -బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిపాలన విధానము, ప్రాజెక్టులు, చాలా అద్భుతంగా ఉన్నాయని జీవీఎంసీని సందర్శించిన ట్రైనీ ఐ ఎ ఎస్ ల గ్రూప్ లీడర్ రక్షన్ పాంట్ మారక్ పేర్కొన్నారు. సోమవారం మధ్యప్రదేశ్, సిక్కిం, గుజరాత్, మేఘాలయ మొదలైన రాష్ట్రాల నుండి 126వ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ గ్రూప్ - 05 సివిల్ సర్వీసెస్ నుండి ఐఏఎస్ లోనికి పదోన్నతి పై వచ్చిన 19 మంది ట్రైనీ ఐఏఎస్ లకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ యంత్రాంగం చేపడుతున్న పరిపాలన, పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులపై ఆయా శాఖ అధికారులు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ యంత్రాంగం పరిపాలన, విధివిధానాలు , అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పలు ప్రాజెక్టులపై ఆయా విభాగాధిపతులు శిక్షణ కొరకు వచ్చిన ఐఏఎస్ లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులు, ప్రజలకు అందించే తాగునీరు, మురుగు నీటి శుద్ధి కర్మాగారం, పార్కులు, వ్యర్థాలు నుండి విద్యుత్తు, ఎరువు, బ్రిక్స్ తయారీ విధానం, బస్ బె, వీధి దీపాల నిర్వహణ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఫ్లోటింగ్ సోలార్ సిస్టం, ఇండోర్ - ఔట్డోర్ స్టేడియంలు, పారిశుధ్యం నిర్వహణ ,క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ, రాత్రి పారిశుధ్యం, మొక్కల నిర్వహణ, పార్కులు, టౌన్ ప్లానింగ్ రెవెన్యూ, యు సి డి మొదలైనవి ఆయా శాఖ అధిపతులు క్లుప్తంగా వివరించారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్ గ్రూప్ లీడర్ జీవీఎంసీ చేపడుతున్న పరిపాలన సంక్షేమం ప్రాజెక్టులు చాలా బాగున్నాయి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఉన్నాయని ప్రశంసిస్తూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ, డిపిఓ ఫణి రామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు కెవిఎన్ రవి, రాజేంద్ర కృష్ణ, వ్యయ పరిశీలకులు సి. వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీరు ఏడుకొండలు, డిసిపి హరిదాసు, చార్టెడ్ అకౌంటెంట్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

సంక్షేమానికి రూ.150 కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : కూటమి ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు జర్నలిస్టులకు 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పలు జర్నలిస్టు సంఘాలు నేతలు డిమాండ్ చేశారు. పలు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం జర్నలిస్టుల ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి నలు మూలల నుండి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ అన్ని వర్గాల గురించి శాసనసభ సమావేశంలో చర్చిస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమంపై చర్చించిన సందర్భాలు లేవని మండి పడ్డారు. తక్షణమే వారి సమస్యలపై ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో చర్చించి వారి సంక్షేమానికి బడ్జెట్ లో రూ.150 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాలలో మాదిరిగా జర్నలిస్టులకు రూ.10వేలు చొప్పున పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు .రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు,అవమానాలు, తప్పుడు కేసులు నమోదవుతున్నాయని వాటి నివారణకు తక్షణమే హై పవర్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల అరకొర సంక్షేమ పథకాలు కొత్త అక్రిడేషన్లతో ముడిపడి ఉన్నాయి కాబట్టి తక్షణమే వాటి జారీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా రంగం నాల్గవ మూల స్తంభంగా ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. దానికి వెన్నుముకగా ఉన్న జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉందని వారిని ప్రత్యేకత వర్గంగా గుర్తించి పలు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పంపే ఉద్దేశంతోకలెక్టర్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఎ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష,ప్రధాన కార్య దర్శులు కె.రాము,ఆర్, రామచంద్రరావు, కె. చంద్ర మోహన్, కోయిలాడ పరశురామ్,జావ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్,కే.ఎం. కీర్తన్, టీజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జార్జి, ఎం.ఎస్. రావు, ఐడిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి నానాజీ, పి. మధు, ఎం.డి.రాజు, ఏపీజేయూ రాష్ట్ర నాయకులు బాలు, ఐజేయూ హరినాథ్, వాసుదేవరావు, ఏపీఈఎం జేఏ చందు యాదవ్, పాలిక రవికుమార్, సామ్నా కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షి నగర్ లో భారీ అక్రమ నిర్మాణం...

తూతూ మంత్రంగా రంధ్రాలు కొట్టి చేతులు దులుపుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

విశాలాంధ్ర-పిఎంపాలెం: జీవీఎంసీ పరిధిలో భారీ అక్రమ నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. నియంత్రించే జీవీఎంసీ కమిషనర్ లేకపోవడంతో ప్రజాప్రతినిధులే దళారులుగా మారి, అధికారుల కు ముడుపులు అప్పగించి, దర్జాగా అక్రమ నిర్మాణాలు, అనధికార అంతస్తులు నిర్మించి రెండు చేతుల సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టిడిఆర్ పేరుతో భారీ అపార్ట్మెంట్ ఏడు స్లాబాలతో నిర్మించిన , ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడ్డం లేదు. జీవీఎంసీలో ఓ డిప్యూటీ మేయర్ చెప్పారన్న వంకతో అనధికారకంగా రెండు అంతస్తులు నిర్మించుకున్నారు. అదనపు అంతస్తు లు నిర్మాణంతోపాటు నిబంధనలకు విరోధంగా సెల్లార్ నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్ లో కమర్షియల్ మెట్ల నిర్మాణం సాగుతుందని స్థానికులంతా పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. జీవీఎంసీలో ఆ ప్రజాప్రతినిధి సిఫారసు చేయడంతో అధికారులు తలో పిడికెడు ముడుపులు తీసుకుని వదిలేశారు. జోన్ 2 పరిధిలో హనుమంతు వాక జంక్షన్ విశాలాక్షి నగర్ వైపు రహదారి ఆనుకొని భారీ అపార్ట్మెంట్ నిర్మాణం నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్నారు. ఆపై కమర్షియల్ కాంప్లెక్స్ సైతం నిర్మాణానికి సిద్ధమయ్యారు. కనీసం షడ్ బాక్స్ కూడా పాటించలేదు ఈ నిర్మాణంలో, బి ఏ నెంబర్ 1086/5337/బి / జెడ్ 2//2021 గల నిర్మాణంకు అనుమతి తీసుకున్నారు. ఇటీవల పత్రికల్లో కథనాలు రావడంతో చిన్న రంధ్రాలు పెట్టి మామా అనిపించారు. ఆ భవన యజమాని తమకేమీ భయం లేదని, తామంతా ముడుపులు పెద్ద ఎత్తున ఇచ్చామని బహిరంగంగా చెప్పడం విడ్డూరంగానే ఉంది. పేద సామాన్య , ప్రజలు చిన్న చిన్న ఇల్లు నిర్మించుకుంటే ప్రతాపం చూపించే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ధనవంతులు, బడా వ్యాపారులు, రాజకీయ నేతలు అక్రమాలు ఎన్ని నిర్మించిన వాటి జోలికి వెళ్ళకపోవడంపై ఆ విభాగంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజిలెన్స్, ఏసీబీ అధికారులు ఇలాంటి అనధికార నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైద్య రంగంలో డా. బాలపరమేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగ నామకరణోత్సవంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వైద్యకళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ న్యూరోసర్జన్, దివంగత డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు అందించిన సేవలు, ఆయన పేరు వైద్య రంగ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి ఆయన పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సోమవారం ఉదయం కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. డా. బాలపరమేశ్వరరావు సూవను గుర్తిస్తూ ప్రభుత్వం అరుదైన గుర్తింపునిచ్చిందని గుర్తు చేశారు. వైద్య రంగంలో ఆయన విశేషమైన సేవలను అందించారని, న్యూరో సర్జరీలో అనేక మైలురాళ్లు దాటి అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి అందరి మన్ననలు అందుకున్నారని, ఆయన చేసిన ఎనలేని సేవలకు గుర్తింపుగా ఆయన పని చేసిన న్యూరో సర్జరీ విభాగానికి ఆయన పేరు పెట్టడం అరుదైన ఘట్టమని కలెక్టర్ అభివర్ణించారు. డా. బాలపరమేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకొని భావితర వైద్యులు పేద ప్రజలకు సేవలందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరమేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను అతిథులతో కలిసి తిలకించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు, ఆంధ్ర వైద్య కళాశాలలో న్యూరో సర్జరీ పూర్వ విభాగాధిపతి, ప్రొ. ఐ. దినకర్, డా. ఆర్. శశిప్రభ, డా. బి. సుబ్బారావు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, కేజీహెచ్ సూరింటెండెంట్ డా. కె. శివానంద, ఆంధ్రవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎం. సంధ్యాదేవి, డా. ఎం. ప్రేమ్ జిత్ రే, డా. బి. హయగ్రీవ రావు, ఇతర అధికారులు, వైద్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై భీమిలి స్టేషన్లో ఫిర్యాదు నమోదు

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు అదృశ్యంపై విడివిడిగా కేసులు నమోదు అయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం తగరపువలస కుమ్మరి వీధికి చెందిన కొప్పాక జగన్నాథం కూతురు కొప్పాక మాధవిలత(33) మానసిక స్థితి బాలేక ఈవిడ కొన్ని రోజులుగా కనబడటం లేదని తమ్ముడు కొప్పాక వెంకట శ్రీధర్ సదరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేశారని తెలిపారు. అలాగే భీమిలి మండలం కృష్ణంరాజుపేట గ్రామానికి చెందిన కాళ్ల బంగారు రాజు(62) మూడు నెలల క్రితం అతని భార్య చనిపోయిన అనంతరం ఈయన మతిస్థిమితం కోల్పోయి ఎప్పటికప్పుడు ఇలానే ఇంటి నుండి వెళ్లిపోయే వారిని అతని కుమార్తె తుపాకుల హేమలత ఫిర్యాదులో తెలియజేసారని స్టేషన్ వారు తెలిపారు. కేసు దర్యాప్తు బాధ్యతలను ఎఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కు అప్పగించారు

పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలతో విద్యార్థులు అనుసంధానం కావాలి

- విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఆచార్యుల నుంచి సంపూర్ణజ్ఞానాన్ని పొందే ప్రయత్నం చేయండి

విశాలాంధ్ర -విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫార్మా పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలతో అనుసంధానం చేయాలని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల 74వ వార్షికోత్సవ వేడుకలు బీచ్ రోడ్ లోని ఏయు కన్వెన్షన్ సెంటర్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉండే కాలాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆచార్యుల నుంచి సంపూర్ణ జ్ఞానాన్ని పొందే దిశగా నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఏ.యూ లో అందుబాటులో ఉన్న డాక్టర్ వి.ఎస్ కృష్ణ గ్రంథాలయాన్ని నిరంతరం సందర్శించడం, అక్కడ విలువైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వారికి ఔషధాల తయారీ, నాణ్యత, పరిశోధన, క్లినికల్ ట్రైల్స్, రెగ్యులేషన్స్, సప్లై చైన్ తదితర విభిన్న విభాగాలలో ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. యువతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి బానిసలు అయితే జీవితం నాశనం అవుతుందని అన్నారు. విద్యార్థులు తమ కలలను, తల్లిదండ్రుల ఆకాంక్షలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో కూడా ఐఓటి, ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటివి అంతర్భాగం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫార్మా రంగంలో అపారమైన డేటా ఉందని దీన్ని విశ్లేషిస్తే మంచి ఫలితాలను పొందడం సాధ్యపడుతుందని చెప్పారు. దీనికి అవసరమైన సాంకేతికతలను ఫార్మా విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. ఆన్లైన్ విధానాల్లో ఉన్న పలు కోర్సులను చేయాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించాలనే తపన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు నూతన సాంకేతికతలను అభివృద్ధి చేసే దిశగా దృష్టి సారించాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రం ఒక నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేస్తున్నాయని విజన్ 2047 సాకారం కావడంలో యువత కూడా భాగస్వామ్యం అవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫార్మా రంగ పరిశోధనలు సమాజానికి నేరుగా దోహదకారిగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి. గిరిజ శంకర్, ఆచార్య వి.గిరిజాశాస్త్రి, ఆచార్య కె. ఈశ్వర్ కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, సాంకేతిక, మేధో పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.

జీవీఎంసి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 86 వినతులు

నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (%ూ+=ూ%) కు 86 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జీవిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో జీవిఎంసి అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జీవిఎంసికి సంబంధించి 86 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 16, 3వ జోన్ కు 23, 4వ జోన్ కు 08, 5వ జోన్ కు 15, 6వ జోనుకు 04, 8వ జోన్ కు 09, జీవిఎంసి ప్రధాన కార్యాలయానికి 09 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జీవిఎంసి అడ్మినిస్ట్రేషన్ %ಐ% అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 12, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 45, ఇంజినీరింగు విభాగమునకు 12, మొక్కల విభాగమునకు 01, యు.సి.డి విభాగానికి 07 కలిపి మొత్తంగా 86 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జీవిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి. నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఎఫ్ %ಐ% ఎ.ఒ మల్లికాంబ, డిడిహెచ్ ఎం.దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, సత్యనారాయణ రాజు, సంపత్ కుమార్, రాజెంద్ర క్రిష్ణ, కె.వి.ఎన్.రవి, సి.పి. మీనా కుమారి, డి.సి.పి. హరిదాసు, డి.పి.ఒ.లు ఎం.వి.డి. ఫణిరామ్, ఎల్.సురేష్, సి.వి.ఒ. డాక్టర్ ఎస్.కిశోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మా బకాయిలు చెల్లించండి ప్లీజ్...

జీవీఎంసీ కంటాక్టర్స్ అసోసియేషన్ నేతలు వినతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ లో బకాయి పడ్డ ఈ ఏడాది బిల్లులను తక్షణమే చెల్లించాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ ను జీవీఎంసీ కంటాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టరెట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో వారు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ను కలిసి రూ . 400 కోట్ల బకాయి సొమ్ము చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరెట్ ఆవరణలో అసోసియేషన్ అధ్యక్షుడు గొ%శీ% పా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సాధురావు, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి మీడియతో మాట్లాడారు. 12 నెలలుగా తమకు సబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో తమ టర్నోవర్ ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. తమ అసోసియేషన్ ద్వారా నగరాభివృద్ధి జరుగుతుంటే తమకు బిల్లులు జాప్యం చెయ్యడం తగదన్నారు. ఈ సంవత్సర కాలంలో రూ .400 కోట్లు తమకు బకాయి ఉందని అవి చెల్లించకపోవడం వలన అసోసియేషన్ సభ్యులందరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ను కలవడం జరిగిందని బిల్లు బకాయి చెల్లించాలని విజ్ఞప్తి చెయ్యడం జరిగిందని పేర్కొన్నారు. తమ విజ్ఞాప్తి పై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఏప్రిల్ నాటికి 13 నెలల బకాయిలు వచ్చే విధంగా జీవీఎంసీ అధికారులు చొరవచూపాలని వారు మీడియా ద్వారా కోరారు.

రుతుక్రమ విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

విశాలాంధ్ర-విశాఖపట్నం: రుతుక్రమ పరిశుభ్రతలో ప్రముఖ బ్రాండ్ అయిన స్టేఫ్రీ, రుతుక్రమ విద్యపై దృష్టి సారించి వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ అయిన మెన్స్ట్రుపీడియాతో భాగస్వామ్యంలో ఒక ముఖ్యమైన కార్యక్రమం రూపొందించినట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. స్టేఫ్రీ మెన్స్ట్రుపీడియా కలిసి, పాఠశాలల్లో ఋతుక్రమ విద్యను అందించడానికి 10,000 మందికి పైగా ఉపాధ్యా యులకు శిక్షణ ఇచ్చాయన్నారు. ఋతుక్రమ ఆరోగ్యాన్ని బాగా అర్థం చేసుకునేందుకు, అంగీకరించేందుకు, సాధారణీకరించేందుకు, యువతుల భవిష్యత్తును సానుకూలంగా రూపొందించే వాతావరణాన్ని పెంపొందించడానికి పది లక్షల కంటే ఎక్కువ మంది బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించాయన్నారు. 2020లో స్టేఫ్రీ, యువతులు, ఉపాధ్యాయులకు రుతుక్రమ ఆరోగ్యం గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు.

ముగిసిన సనపల సూర్యనారాయణ, అన్నపూర్ణమ్మ స్మారక నాటకోత్సవాలు

విశాలాంధ్ర-విశాఖ : కీర్తిశేషులు సనపల సూర్యనారాయణ, అన్నపూర్ణమ్మ స్మారక నాటకోత్సవాలు ముగిశాయి. విశాఖపట్నం పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కె.వి. మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్తంగా మూడురోజులు పాటు ఈ నాటకోత్సవాలు నిర్వహించాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన కళాకారులు నాటకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు, రచయితలు, సమాజ సేవకులకు ఆత్మీయ విశిష్ట పురస్కారాలను అందజేశారు. నాటకోత్సవాల్లో పాల్గొన్న ప్రతి కళాకారుడినీ అభినందించడంతోపాటు మహిళా కళాకారులకు చీరలను అందజేశారు. కార్యక్రమాలను ప్రముఖ కళాకారులు చౌదరి అప్పారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షులు సనపల వరప్రసాద్, అన్నెపు నారాయణరావు, ఈటి రాంబాబు, పి వెంకట సూర్యనారాయణ రాజు, పి శివప్రసాద్, సనపల శ్రీనివాసరావు, వావిలపల్లి భాను, మూల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో యాక్టివ్ మూమెంట్ ఫిజియోథెరపీ ఫిట్నెస్ & వెల్నెస్ హబ్

నేచురల్ పద్ధతిలో చికిత్స

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో యాక్టివ్ మూమెంట్ వారి ఫిజియోథెరపీ ,ఫిట్నెస్ & వెల్నెస్ హబ్ ద్వారా అన్ని రకముల కీళ్ల నొప్పులకు ఫిజియోథెరపీ ఫిట్నెస్ పరికరాల ద్వారా నేచురల్ పద్ధతిలో చికిత్స అందించ బడునని డాక్టర్ ఏ సాయిలత పేర్కొన్నారు. సోమవారం ఆనంద పురం కూడలిలో గోపి మెడికల్ షాప్ సమీపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక సుదీర ప్రాంతాలకు వెళ్లి రోగులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆనందపురం పెద్దిపాలెంలో ఫిజియోథెరపీ ఫిట్నెస్ పరికరాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యానికి అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కొవ్వు, ఊబకాయం ఉన్న వ్యక్తులకు ప్రత్యేకమైన తెరిపీల ద్వారా చికిత్స అందించబడుతుందన్నారు స్త్రీలకు ప్రత్యేకమైన ఫిట్నెస్ పరికరాల ద్వారా స్త్రీలలో వచ్చే సమస్యలను పరిష్కారానికి ఈ ఫిట్నెస్ తెరిపి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఢిల్లీలో ప్రత్యేకమైన శిక్షణ పొంది గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇక్కడ యాక్టివ్ మూమెంట్ పేరట హాస్పటల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ముఖ్యంగా మాన్యుల్ తెరిపి ,పిఎన్ఎఫ్,కప్పింగ్ థెరపి, ట్రైంగ్త్ శిక్షణ, కోల్డ్ అండ్ హార్ట్ తెరపి ద్వారా వివిధ రకాల వ్యాధులను నయం చేస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు ఆదివారం 9 గంటల నుండి ఒంటిగంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరములో పలువురుకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి థెరిపి కొరకు ఆసుపత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఆకుల దేవేంద్ర కుమార్ ,గోపి మెడికల్ షాప్ యజమాని కొట్యాడ గోపి, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ముమ్మన ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు

విశాలాంధ్ర-పెందుర్తి: బాలల హక్కులు, రక్షణ సమస్యలపై నివారణ నివేదికలు పర్యవేక్షణ రక్షణపై ప్రతిస్పందించడానికి రాష్ట్రంలో ప్రతి గ్రామంలో గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీవీఎంసీ 95 వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 95వ వార్డు పాపయ్యరాజుపాలెం మండల ప్రాథమిక పాఠశాలలో ముమ్మన దేముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ స్థాయి,వార్డు స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ కమిటీలు గ్రామ అనాథలు,వీధి బాలలు మొదలైన వారిని ఆదుకోవడానికి అర్హులైన పిల్లలను గుర్తిస్తుందని,ఈ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం స్పాన్సర్షిప్ కాంపోనెంట్ సౌకర్యాలు కల్పించడం,సిడబ్ల్యుసి సిఫార్సు మేరకు స్పాన్సర్షిప్ పోస్టర్ కేర్ , కేర్ అప్రూవల్ కమిటీ ఎస్ఎఫ్ సిఎసి ద్వారా ఆమోదించబడిన స్పాన్సర్షిప్ సౌకర్యాలు ఈ పిల్లలకు అందుతాయన్నారు. అర్హత గల పిల్లలకు స్పాన్సర్షిప్ సౌకర్యాలను విస్తరించడానికి కమిటీ సహాయపడుతుందన్నారు. అంతేకాక బాల్యవివాహాల నిషేధ చట్టం, పిసిఎంఎ 2006 ప్రకారం,బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, అబ్బాయికి 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు నిండితేనే వివాహానికి అర్హులని పేర్కొన్నారు. ఈ వయసునిండకుండా బాల్య వివాహం, చేసినట్లయితే ఈ చట్ట ప్రకారం బాల్య వివాహాలకు 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష రూ "1లక్ష వరకు జరిమానా విధించవచ్చునన్నారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, వార్డు రెవెన్యూ సెక్రెటరీలు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహకారక ఆర్.పిలు,ఎన్ జీవోలు,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండాకాలంలో ప్రజల దప్పిక తీర్చుతున్న పెందుర్తి పోలీసులు

విశాలాంధ్ర-పెందుర్తి : మార్చి నెలలోనే ఎండలు మండిపో తుండంతో ప్రజల దప్పిక తీర్చేందుకు పెందుర్తి పోలీసులు చర్యలు చేపట్టారు. సిఐ కెవి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై ఆశిరితాత సోమవారం ఉదయం పెందుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు చిరు వ్యాపారులకు ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సిఐ కెవి సతీష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు, ప్రయాణీకులకు, స్థానికులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగు తుండటంతో, పోలీస్ స్టేషన్‌కు విచ్చేసే ప్రజలు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. చల్లటి మజ్జిగ, మంచి నీరు, పంపిణీ చేసి వేసవి తాపం నుండి ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యాక్రమాన్ని చేపట్టామన్నారు.ఈ చలివేంద్రం వేసవి కాలం పూర్తయ్యే వరకు కొనసాగుతుందని, వచ్చే రోజుల్లో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని" తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానిక పెద్దలు, సామాజిక సేవకులు పాల్గొని, పెందుర్తి పోలీసుల సేవా భావాన్ని ప్రశంసించారు.

మందుబాబులకు జరిమానా, జైలు శిక్ష

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిపై కేసుల నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై నర్సింగ రాజు తెలియజేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా వారిలో 13 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున 1. 30లక్షలు జరిమానా విధించగా, విజయనగరం జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్షను న్యాయమూర్తి విధించారని తెలిపారు. నిబంధనలు దిక్కరించి వాహనాలు నడిపితే ఉపేక్షించబోమని సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ఐ నరసింగరాజు ఈ సందర్భంగా తెలియజేశారు.

సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయండి

అసెంబ్లీలో ముఖ్యమంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి: నాలుగు నియోజకవర్గాలకు కూడలిగా ఉన్న సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రిని గత పాలకులు నిర్వీర్యం చేశారని దాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ హాస్పిటల్ భవనం శిదిలావస్థలో ఉందని, పెచ్చులూడిపోతూ ప్రమాదకర స్థితికి చేరిందని వివరించారు. గత ప్రభుత్వం జీఓ 143 తో 30 పడకల నుండి 6 పడకలకు, 51 నుండి 14 వరకు సిబ్బందిని తగ్గించారని విమర్శించారు. సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా వేలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని దాన్ని అత్యవసరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు పరికారాలు, సిబ్బంది ప్రొవైడ్ చేస్తే కొత్త బిల్డింగ్ భాద్యతలు తాను తీసుకుంటానని పంచకర్ల రమేష్ బాబు ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.

కైలాసగిరి పై గ్లాస్ బ్రిడ్జి

వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్, ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర-విశాఖ : కైలాసగిరి పై 50 మీటర్ల గ్లాస్ బ్రిడ్జిని ఏప్రిల్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ఎంసీ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిరిపురంలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కమర్షియల్ కాంప్లెక్స్.. 'ది డెక్', బీచ్ రోడ్ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి వాటిని ప్రారంభిస్తారని చెప్పారు. భోగాపురం విమానాశ్రయానికి మాస్టర్ ప్లాన్ లో 15 కనెక్టివిటీ రోడ్లను ప్రతిపాదించామని ఒక రోడ్డు నిర్మాణం పూర్తయిందని, మిగతా వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అనకాపల్లిలో ఏడెకరాల్లో హెల్త్ సిటీని ఏర్పాటుచేసేందుకు స్థలాన్ని గుర్తించనున్నట్టు తెలిపారు. వీఎంఆర్డీఏలో ప్రజాదర్బార్ కు ఇప్పటి వరకు 122 వినతులు రాగా, వాటిలో 59ని పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. మిగతావి న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. 'ది డెక్' పేరిట నిర్మించిన మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలుస్తుందన్నారు. అందులో 1.90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్కింగ్, 1.60లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కమర్షియల్ స్థలం అందుబాటులో ఉందన్నారు. తీర ప్రాంత కోతను నియంత్రించేందుకు మొదటి విడతగా ధాన్ ఫౌండేషన్ సహకారంతో వీఎంఆర్డీఏ పార్కు సమీపంలోని తీరంలో 1.50 ఎకరాల విస్తీర్ణంలో 6 రకాలైన గంగరావి, రావి, కొబ్బరి, బాదం, సరుగుడు వంటి 1200 మొక్కలను నాటామని చెప్పారు. కైలాసగిరి, సెంట్రల్ పార్కు, తెన్నేటి పార్కుల్లో ఒక్కొక్కటి రూ.16.50లక్షల వ్యయంతో సహకారంతో రక్షిత తాగునీటి సదుపాయం కల్పించామని, త్వరలో సబ్ మెరైన్ మ్యూజియం, టియు-142 వద్ద కూడా రక్షిత తాగునీటి సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. కైలాసగిరికిపై పీపీపీ విధానంలో ఏర్పాటు చేసిన స్కై సైక్లింగ్, జిప్ లైనర్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయని వివరించారు. అనకాపల్లి కొత్తూరు గ్రామం చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. వీఎంఆర్డీఏ పార్కుల్లో ఎమ్మెల్యేల సూచన మేరకు సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. హెల్త్ ఏరినాలో రూ.28.50లక్షలు, సెంట్రల్ పార్కులో రూ.8లక్షలు, విఎంఆర్డీఏ పార్కులో రూ.40 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయలు మెరుగుపరుస్తు న్నామన్నారు. విశాఖ పరిసరాల్లోని తీర ప్రాంతం కోతకు గురి కాకుండా రూ.200 కోట్ల నిధుల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం, వీఎంఆర్డీఏ 90:10 నిష్పత్తితో తీర ప్రాంత కోత నివారణ పథకం డీపీఆర్‌ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు. విశాఖలోని ఆర్కేబీచ్, పెదజాలారిపేట, సబ్ మెరైన్, మంగమారిపేట, భీమిలి ఇలా విజయనగరం వరకు గుర్తించిన 22 ప్రాంతాల్లో తీరం కోతకు గురి కాకుండా చర్యలు చేపడతామన్నారు. వీఎంఆర్డీఏ బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) -2042ను పారదర్శకంగా సవరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ నెలాఖరుకి టెండర్లు ఖరారు చేసి, ప్రజాప్రతినిధులు, ప్రజల మంచి వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి, పూర్తి పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ ని సవరిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని 14 మండలాలు వీఎంఆర్డీఏలో వీలీనమయ్యాయని, వాటిని కూడా మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తీసుకువస్తామన్నారు. కొత్తగా గిడిజాల, తుంపాల, కాపులుప్పాడ, నిడిగట్టు తదితర ప్రాంతాల్లో లేఅవుట్లు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

కృత్యాధార బోధనా పద్ధతులతో బోధన అవసరం

బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ప్రసాదరావు

విశాలాంధ్ర-పొందూరు: అంగన్వాడి విద్యాబోధనలో పిల్లలకు కృత్యాధారా బోధన పద్ధతులతో బోధన ఎంతైనా అవసరమని బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం ప్రసాదరావు కోరారు. మండలం లోలుగు ఉపహార్ ఎన్జీవో కార్యాలయంలో బ్రిడ్జిపురం యూత్ క్లబ్ అనుబంధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జి సిగడాం పొందూరు ఎచ్చెర్ల మండలాల పూర్వ ప్రాథమిక తరగతుల బోధన నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని పై విధంగా అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సిడిఎఫ్ మోడల్, కృత్యా ధార బోధన పద్ధతులను ఆటపాటలతో అభినయగేయాలతో విద్యార్థులు ఉత్సాహపరిచే విద్యా బోధన అలబరుచుకునేలా చూడాలని ఆయన కోరారు. ఎచ్చెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ డి పాపి నాయుడు మాట్లాడుతూ పి ఎస్ సి ట్రైనీలు నేర్చుకునే వాటిని అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని ఆదేశించారు. సిడిఎఫ్ మోడల్ ఫిఫ్త్ ఫేస్ పైన అంగన్వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి మాధవి ప్రాజెక్టు వివరాలు విపులంగా వెల్లడించారు. సంస్థ కోశాధికారి పి అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యావ్యవస్థ విద్యార్థి కేంద్రీకృతంగా ప్రయాణం చేయవలసిన అవసరం ఉందన్నారు ఈ లక్ష్యం కోసం యూత్ క్లబ్ పని చేస్తుందన్నారు. ఉపహార్ ఎన్జీవో కమ్యూనిటీ ఫెసిలీటర్ ఎల్ అప్పారావు మాట్లాడుతూ ఈ శిక్షణను సక్రమంగా వినియోగించుకుని ఫీల్డ్ లో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ కాళ్ళ శ్రావణి,వై. శంకర్రావు,ఏ రమణమూర్తి, పి ఉమ మహేశ్వరరావు, మెహర్ వాణి, ఐ రాధా వై వసంతి ఏ. అప్పలనాయుడు పి. అప్పలనాయుడు, ఎన్. సంతోష్ లతో పాటు సంస్థ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ సామాజిక వర్గానికి బీసీ బీలో చేర్పించాలి

శాసన మండలిలో గళం వినిపించిన నర్తు

విశాలాంధ్ర-కవిటి: యాదవ సామాజిక వర్గానికి బీసీ బీలో చేర్పించాలని శాసనమండలిలో శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు నర్తు రామారావు తన గళం ద్వారా వినిపించారు. ఈ మేరకు సోమవారం జరిగిన శాసలమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో ఉన్న యాదవులంతా సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారని అన్నారు . వీరంతా గొల్లలుగా పిలవబడుతూ, పశువుల కాపర్లు గాను, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, ఇప్పటికీ కులవృత్తులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారని విన్నవించారు. పాలు, పెరుగు, మజ్జిగ, వంటి పదార్థాలను ఇంటింటికి తిరిగి అమ్మకాలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలియజేశారు. వీరి జీవితాలలో మార్పు లభించి, విద్యా ఉపాధి పరంగా ఉన్నత స్థితి పొందాలంటే వీరిని ప్రత్యేకంగా గుర్తించి, బిసి డి నుంచి బీసీ బీ లోకి చేర్చాలని, ఆ దిశగా ప్రభుత్వం అధ్యయనం చేయాలని అభ్యర్థించారు.

ఐదు కేంద్రాలలో పది పరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర-పోలాకి: మండల కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమై ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు పోలాకి ప్రభుత్వ హై స్కూల్, పోలాకి గర్ల్స్ హై స్కూల్, ప్రియాగ్రహారం హై స్కూల్, కోడూరు హై స్కూల్, ఈదులవలస ఏపీ మోడల్ హై స్కూల్ ల్లో ఈ కేంద్రాలలో మొత్తం 795 మంది పరీక్షలు వ్రాయవలసి ఉండగా మొదటిరోజు తెలుగు పరీక్షకు 789 మంది హాజరయ్యారని స్థానిక ఎం.ఇ.ఒ శ్రీనివాస్ పట్నాయక్ తెలిపారు. కస్తూరిబా పాఠశాలతో కలసి ప్రభుత్వ యాజమాన్యం నడుస్తున్న 11 పాఠశాలలుండగా, ప్రవేటు యాజమాన్యంలో 5 పాఠశాలలు పనిచేస్తున్నాయి. ప్రారంభం రోజు పరీక్షాకేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు. విద్యార్థులు మొదటిరోజు తెలుగు పరీక్షలో ఆనందం నెలకొంది.

సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్ కు విశాఖ పోర్ట్ యాజమాన్యం ఘనస్వాగతం...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ డా. ఎం. అంగముత్తు, నేతృత్వంలో సిఐఎస్ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్-2025 బృందంలోని 50 మంది సభ్యులకు మార్చి 17న ఆర్.కె. బీచ్ వద్ద సాదర స్వాగతం పలికారు. సిఐఎస్ఎఫ్ 56వ రైజింగ్ డే ను పురస్కరించుకొని ఈ సైక్లోథాన్ ని ప్రారంభించారు.

ఈ సైక్లోథాన్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మార్చి 7న అరకోణం, తమిళనాడు నుండి వర్చువల్‌గా ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఈ సైక్లోథాన్ మార్చి 31న వివేకానంద రాక్ మెమోరియల్, కన్యాకుమారి వద్ద ముగియనుంది. ఈ సందర్భంగా డా. ఎం. అంగముత్తు, వి పి టి చైర్‌పర్సన్, మాట్లాడుతూ, ఈ ఏడాది సైక్లోథాన్ థీమ్ "సేఫ్ కోస్ట్, ప్రాస్పరస్ ఇండియా" అని తెలిపారు. ఈ సైక్లోథాన్ భారత తూర్పు మరియు పడమటి తీర ప్రాంతాలను కవర్ చేస్తూ 6553 కిలోమీటర్ల తీర రేఖను పూర్తి చేయనుంది.ఈ సైక్లోథాన్ ముఖ్య ఉద్దేశ్యం తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, స్ఫోటక పదార్థాలు వంటి ప్రమాదాలపై చైతన్యం కల్పించడం, తీర భద్రతను మెరుగుపరిచేందుకు స్థానిక సమాజం , భద్రతా సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడ%శీ%, యువతలో మాదకద్రవ్యాల వినియోగ ప్రమాదాలు మరియు తీర ప్రాంత భద్రత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం, ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి . విశాఖ నగర ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున సైక్లోథాన్-2025 ను వీక్షించి ప్రోత్సహించారు.

ఈ సైక్లోథాన్ ను 2025 మార్చి 18 ఉదయం 06:00 గంటలకు విశ్వప్రియ ఫంక్షన్ హాల్, బీచ్ రోడ్, విశాఖపట్నం వద్ద నుండి డా. ఎం. అంగముత్తు, ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు సైక్లోథాన్ బృందంతో కొంత దూరం వరకు ప్రయాణించి మద్దతు తెలియజేయనున్నారు.